క్లుప్తంగా

దాడి చేశారని ఫిర్యాదు

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని ఆకుతోట ప్రాంతంలో శిరిడీ సాయి లేఅవుట్‌లో తమ స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నించగా, తాము అడ్డుకోవడంతో దాడి చేశారని బద్వేల్ మోహన్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగులపై పీ4 భారం

- తక్కువ జీతాలకు, అధిక బాధ్యతలతో ఉక్కిరిబిక్కిరి



కోవూరు: ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమం ఇప్పుడు సచివాలయ ఉద్యోగులపై భారంగా మారింది. దాతల ద్వారా పేదల అభివృద్ధికి రూపొందించిన కార్యక్రమంపై వ్యాపారవేత్తలు, ప్రముఖులు ముందుకు రాకపోవడంతో ప్రచారం కోసమే పరిమితమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులే మార్గదర్శకులుగా ఉంటూ దత్తతదారుల పేర్లను నమోదు చేసుకునేలా అధికారుల ఒత్తిడికి గురవుతున్నారని సచివాలయ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే వలంటీర్ల బాధ్యతలతో పాటు ప్రతినెలా కొత్త కొత్త సర్వేలతో ఉద్యోగులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

వలంటీర్ల పనులు మేమే చేస్తున్నాం

ఇప్పటికే వలంటీర్ల బాధ్యతలను సచివాలయ సిబ్బందికి మళ్లించడం వల్ల వారి పని భారం రెట్టింపు అయ్యింది. వలంటీర్లు నిర్వహించే సర్వేలు, ప్రతి నెలా చేసే సర్వేలతో పాటు ఇప్పుడు మరోసారి పీ4 ముసుగులో 'దత్తతదారులు' పేరుతో జరిగే రిజిస్ట్రేషన్ల పని కూడా సచివాలయ సిబ్బందికే అప్పగించడంతో మనో వేదనకు గురవుతున్నారు.

మా కుటుంబాలనే దత్తత తీసుకోండి

కోవూరు నియోజకవర్గంలో మొత్తం ఐదు మండలాలకు సంబంధించి 927 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 7,725 మంది సిబ్బంది వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడి ఈ అక్టోబర్‌కు ఆరు సంవత్సరాలు పూర్తవుతున్నా, ఇప్పటికీ వేతనాల్లో న్యాయమైన పెరుగుదల లేకపోవడం తీవ్ర నిరాశకు గురవుతున్నారు. మొత్తం ఏడు ఇంక్రిమెంట్లు రావాల్సిన ఉద్యోగులకు కేవలం మూడు మాత్రమే అందాయి. తర్వాతి స్థాయికి ప్రమోషన్ ఆశలు కూడా నెరవేరక, నెలకు సుమారు రూ.6 వేలు నష్టపోతున్నారు. 'ఒకవైపు పిల్లల చదువులు, మరోవైపు ఇంటి ఖర్చులకు తగినట్లు జీతాలు లేవంటూ వాపోతున్నారు. ఈ క్రమంలో తమనే దత్తత తీసుకునేందుకు ముందుకు రావాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భద్రకాళమ్మకు పొంగళ్లు



పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో భద్రకాళమ్మకు ఆదివారం మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. పూజ, పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. గ్రామపెద్దలు పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కసుమూరులో భక్తుల సందడి

వెంకటాచలం: మండలంలోని కసుమూరు మస్తాన్‌వలీ దర్గాకు ఆదివారం భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున విచ్చేయడంతో ఆ ప్రాంగణం కిటకిటలాడింది. ముజావర్లు భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ, సుబ్రహ్మణ్యశర్మ అమ్మవార్లకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకున్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

పొదలకూరు: పట్టణంలో గంగమ్మతల్లి కొలువు సందర్భంగా చివరిరోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పూజలు, 11 గంటలకు ముగ్గు దిష్టి తీర్పు, సాయంత్రం వైభవంగా బోనాల ఊరేగింపు జరిగింది. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దేవస్థాన ప్రాంగణంలో పొంగళ్లు పెట్టుకున్నారు.

ప్రమాదమని తెలిసినా.. పట్టించుకునే వారేరీ?

- కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్
- ఫిర్యాదులు చేసినా.. అధికారుల చర్యలు శూన్యం



కాలువలో ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కూలేందుకు సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్‌తో స్థానిక ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నగరంలోని 53వ డివిజన్ పునరావాస కాలనీలో ఓ విద్యుత్ స్తంభం వాలిపోయి ఏ క్షణంలోనైనా పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. గత కొన్ని సంవత్సరాల నుంచి ఈ విధంగా ఉన్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఈ ప్రాంతంలోనే ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సైడు కాలువల అంచులో నిర్మించారు. ప్రస్తుతం కాలువ ధ్వంసం కావడంతో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసిన దిమ్మె ఒరిగిపోయింది. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ కూలిపోయే స్థితికి చేరింది. అదే జరిగితే పెను ప్రమాదం సంభవించే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయాలని, ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను సరిచేయాలని కోరుతున్నారు.



కూలిపోయేందుకు సిద్ధంగా వాలిపోయిన విద్యుత్ స్తంభం

పట్టించుకోవడం లేదు



వాలిపోయిన స్తంభాన్ని మార్చాలని ఎన్నిసార్లు విద్యుత్ సిబ్బందికి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. స్తంభం పడిపోయి ఎక్కడ ఇళ్లపై మనుషులపై పడి ప్రమాదం జరుగుతుందోననే ఆందోళన ఉంది. రానున్న వర్షాకాలంలో, వీచే గాలులకు కచ్చితంగా పడిపోతుంది. ముందే స్తంభాన్ని మార్చి ప్రమాదం నుంచి కాపాడాలి.

– సరస్వతి, స్థానికురాలు

చూస్తున్నారు.. వెళ్తున్నారు..



పునరావాస కాలనీ నల్లకాలువ వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ సైడు కాలువపై నిర్మించారు. కాలువ గోడలు పడిపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ కుంగిపోయి ప్రమాదకరంగా ఉంది. ఈ విషయమై విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చాం. నెల రోజుల క్రితం అధికారులు వచ్చి చూసి వెళ్లారు. కానీ ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా కుంగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను బాగుచేయాలి.

– లక్ష్మీనారాయణ, స్థానికుడు

భయంగా ఉంది



పునరావాస కాలనీలోని విజయా డెయిరీ వెనుక విద్యుత్ స్తంభం గత కొన్నేళ్ల నుంచి వాలిపోయింది. ఏ క్షణంలో పడిపోతుందోననే భయంగా ఉంది. వెంటనే ఈ స్తంభాన్ని మార్చి వేసి మరో స్తంభాన్ని ఏర్పాటు చేయాలి.

– టీవీ శేషమ్మ, స్థానికురాలు

వేడుకగా నగరోత్సవం



విశేషాలంకారంలో నగరోత్సవానికి సిద్ధమైన అమ్మవార్లు

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డు వెంగళరావునగర్ సీ–బ్లాక్‌లో ఉన్న ముత్యాలమ్మ దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. గత నాలుగు రోజులుగా అమ్మవారికి జరుగుతున్న వార్షికోత్సవ మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆదివారం నగరోత్సవం వేడుకగా నిర్వహించారు. అమ్మవారు విశేష పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ఉదయం జొన్నవాడ దగ్గర పినాకిని నది నుంచి 501 కలశాలతో తెచ్చిన పవిత్ర గంగాజలంతో అభిషేకించారు. కార్యక్రమాలను ఆ దేవస్థానం నిర్వాహకులు పర్యవేక్షించారు.



డీకేడబ్ల్యూ కళాశాలకు రూ.75 వేల వితరణ



ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న సంఘ సభ్యులు

నెల్లూరు(బారకాసు): స్థానిక శాంతినగర్ నిర్మల సౌథలో నెల్లూరు రెడ్ల ఐక్యవేదిక నెలవారీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీకేడబ్ల్యూ కళాశాలలో కుర్చీలకు సంబంధించిన రూ.75 వేల చెక్కును కాలేజీ ప్రిన్సిపల్‌కు అందజేశారు. అలాగే సంఘ సభ్యులు పెనాక సుజాతారెడ్డి రూ.2,500, ప్రదీప్‌రెడ్డి రూ.2,500లతో పాటు సంస్థ తరఫున మరో రూ.5 వేలు కలిసి పేద విద్యార్థి మారంరెడ్డి నితిన్‌కుమార్‌రెడ్డికి రూ.10 వేలను చెక్కు రూపంలో అందించారు. తర్వాత ఈనెలలో జన్మదినం జరుపుకుంటున్న డాక్టర్ నిశ్చల్‌ప్రసాద్‌రెడ్డి, హైటెక్ రమణారెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, బెజవాడ సునీల్‌కుమార్‌రెడ్డి, బత్తిన కుమారస్వామిరెడ్డి, పెనాక సుజాతారెడ్డిలు కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, కార్యదర్శి ప్రతాపరెడ్డి, కార్యవర్గ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, కమిటీ సభ్యులు మల్లికార్జున్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, కేత అమర్నాథ్‌రెడ్డి, కల్లూరు రమణారెడ్డి, ద్వారం వేణుగోపాల్‌రెడ్డి, ఎద్దుల రామచంద్రారెడ్డి, హరినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘ జిల్లా కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

నెల్లూరు(బారకాసు): జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నగరంలోని పొదలకూరురోడ్డులో ఉన్న హెచ్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడిగా డాక్టర్ మన్నెం సతీష్, ప్రధాన కార్యదర్శిగా కొండా మాధవయ్య, కోశాధికారిగా వార్త రాజేంద్రప్రసాద్‌లను ఎన్నుకున్నారు. ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా పంచాయతీరాజ్ విశ్రాంత ఎస్ఈ పముజుల నాగేశ్వరరావు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ హెచ్ఎం గౌరబత్తిన హజరత్ వ్యవహరించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సజ్జా సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి చెప్పరం మల్లికార్జున, గౌరవాధ్యక్షులు కర్ణ రాఘవరావు, కన్నా మధుసూదనరావు, జాగబత్తిన శైలేష్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



యూటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర నాయకులు

నెల్లూరు(అర్బన్): నగరంలోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో యూటీఎఫ్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పూర్వ కార్యదర్శి బాబురెడ్డి, పరంధామయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటాలు చేసిన సంఘం యూటీఎఫ్ అని తెలిపారు. అయితే సాధించిన హక్కులకు కాలరాసేలా నేటి ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలపై మరోసారి పోరాటం చేయాలన్నారు. పీఆర్సీ, డీఏల సాధనకు మరో పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అచ్చయ్య, కోశాధికారి మురళీధర్‌రావు, కార్యదర్శులు సురేంద్ర, అనిల్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ మధుసూదన్‌రావు, శ్రీనివాసులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలి



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు సిటీ: సచివాలయ సిబ్బంది ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలని.. సంక్షేమ ఫలాలు పేదలందరికీ అందేలా చూడాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నారాయణ మెడికల్ కళాశాలలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం సచివాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల్లూరును మోడల్ సిటీగా తీర్చిదిద్దేందుకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

- నగరంలోని మైపాడుగేటు వద్ద స్మార్ట్ స్ట్రీట్ కింద 240 షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి నారాయణ పేర్కొన్నారు. నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మెప్మా మహిళలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ స్ట్రీట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఈ క్రమంలో మైపాడు గేట్ సెంటర్ వద్ద తొలివిడతలో 120 షాపులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు కార్పొరేషన్, మెప్మా ద్వారా రూ.2 లక్షల సబ్సిడీ అందుతుందని, బ్యాంకు ద్వారా రూ.2 లక్షల రుణం మంజూరవుతుందన్నారు.
- టైలర్స్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానని మంత్రి నారాయణ అన్నారు. ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం టైలర్స్ అసోసియేషన్ నేతలు భేటీ అయ్యారు. టైలరింగ్ వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టైలర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై విచారణ జరపాలి

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఆర్ఎన్నార్ ప్రైవేటు ఇంటర్ కళాశాలలో ఆదివారం మృతి చెందిన విద్యార్థినికి సంబంధించి సమగ్ర విచారణ చేపట్టాలని, అందుకు కారకులైన యాజమాన్యంపై కఠిన చర్యలు చేపట్టాలని ది పేరెంట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శిఖరం నరహరి, ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ ఆ కళాశాల వారు ఎలాంటి అనుమతుల్లేకుండా హాస్టల్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆ కళాశాల గుర్తింపును రద్దు చేయాలన్నారు. జిల్లాలో అనుమతుల్లేకుండా కళాశాలలకు అనుబంధంగా నిర్వహిస్తున్న హాస్టల్స్‌ను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సెలవు దినాల్లో కూడా తరగతులు నిర్వహిస్తూ.. మార్కుల పేరిట తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్న అంశంపై లోతుగా దర్యాప్తు చేసి చర్యలు చేపట్టాలని కోరారు.

14న కోవూరులో జాబ్‌మేళా

నెల్లూరు(పొగతోట): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఈనెల 14న కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యూం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ కంపెనీల్లో ఖాళీగా ఉన్న 800 ఉద్యోగాలను భర్తీ చేసేందుకు జాబ్‌మేళా జరుగుతుందని, కోవూరు నియోజకవర్గంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ చదివిన యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం 93812 65558, 99888 53335 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేత్రదానం



పాపారెడ్డి బాబురెడ్డి(ఫైల్)

నెల్లూరు(అర్బన్): స్థానిక అల్లీపురంలోని పీఎస్సార్ నగర్‌కు చెందిన పాపారెడ్డి బాబురెడ్డి (72) శనివారం రాత్రి ఆయన స్వగృహంలో మృతిచెందారు. ఈ క్రమంలో ఆయన నేత్రాలను కుటుంబసభ్యుడు రఘురామ్‌రెడ్డి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు దానం చేశారు. దీంతో ఎల్వీ ప్రసాద్ ఐ ఆస్పత్రి టెక్నీషియన్ సునీల్ మృతుని నేత్రాలను సేకరించి కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్‌ను అందించారు. ఈ సందర్భంగా టెక్నీషియన్ సునీల్ మాట్లాడుతూ నేత్రదానం చేసేందుకు 99595 89321 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

బీజేపీ నేతల బైక్ ర్యాలీ



నెల్లూరురూరల్: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు ముందుగా హర్ ఘర్ తిరంగాలో భాగంగా రామలింగాపురంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. లెక్చరర్స్ కాలనీ నుంచి ముత్తుకూరు బస్టాండ్ గేటు వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా బీజేపీ నేతలు చిలకా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ దేశ సమైఖ్యత కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మదన్ సాయిరెడ్డి, ఆడపాల మదన్‌సాయిరెడ్డి, నారాయణ, అవినాష్ కిరణ్, పాల్గొన్నారు.

కాకాణి పూజితకు సత్కారం



కాకాణి పూజితను సత్కరిస్తున్న నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన కాకాణి పూజితను పార్టీ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి చీదెళ్ల కిషన్, 11వ డివిజన్ ఇన్‌చార్జి మహేష్ యాదవ్‌లు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను సత్కరించి అభినందనలు తెలిపారు.

పర్మిట్ రూమ్స్‌తో విష సంస్కృతికి బీజం

- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ ఎక్సైజ్ విధానానికి విరుద్ధంగా పర్మిట్ రూమ్స్‌కు అనుమతినిస్తూ కూటమి ప్రభుత్వం విష సంస్కృతికి బీజం వేసిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరిరెడ్డి అన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో ఆమె ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. చంద్రబాబు పేద ప్రజల సంపద దోచుకునేలా నూతన మద్యం పాలసీలతో సంపద సృష్టించాలనే కుటిల ఆలోచన చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల పేరుతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు 14 నెలల పాలనలో వాటిని అమలు చేయకుండా పేద, మధ్య తరగతి కుటుంబాలు రోడ్డున పడేలా మద్యాంధ్ర ప్రదేశ్ చేశారన్నారు. ప్రస్తుతం పర్మిట్ రూమ్‌లకు అనుమతితో చంద్రబాబు మార్క్ మోసానికి మరోసారి ఆడబిడ్డలు బలవుతారన్నారు. ఇప్పటికే బడి, గుడి అనే తేడా లేకుండా మద్యం షాపులు ఏర్పాటు చేయడమే కాక, పర్మిట్ రూమ్స్ పెట్టుకునేల అనుమతులు ఇవ్వడం అత్యంత హేయమైన చర్య అన్నారు. జగనన్న ప్రభుత్వంలో 33 శాతం మద్యం షాపులు తగ్గించడమే కాకుండా వాటికి అనుబంధంగా ఉన్న పర్మిట్ రూమ్స్‌ను, దాదాపు 43 వేల బెల్ట్ షాపులను రద్దు చేశారన్నారు. చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలు అమలులో పూర్తిగా విఫలమై డైవర్షన్ పాలిటిక్స్ చేస్తూ కక్ష సాధింపులు, దాడులు, దౌర్జన్యాలతో పాలన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా మహిళలకు అన్యాయం జరుగుతున్న ఈ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేత్రపర్వం.. వెంకటేశ్వరుని కల్యాణం



నెల్లూరు(బారకాసు): నగరంలోని కోదండరామపురంలో ఉన్న మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు ఆదివారం ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం అమ్మవారికి విశేషాభిషేకం, హోమాలు, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు నిత్య తిరు కల్యాణోత్సవాన్ని పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య సాగింది. అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవాన్ని జరిపారు. ఈ క్రమంలో దేవస్థానం ప్రాంగణమంతా నమో వెంకటేశాయ, గోవిందా అనే నామస్మరణతో మార్మోగింది. కుర్తాళం పీఠ ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. కాటేపల్లి వెంకటరమణయ్య–సరిత, చంద్రకల్యాణ్, లక్ష్మి, అభినందన ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఘనంగా వార్షిక వేడుకలు



కోట రాధాకృష్ణమూర్తి, మురళీకృష్ణలకు సన్మానం

నెల్లూరు(బృందావనం): పురమందిరంలో 'బిగ్ వేవ్ ఈవెంట్స్' 17వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సంస్థ నిర్వాహకుడు వై.రవిబాబు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భాస్కర బిరుదాంకితుడు, ఉపన్యాసకుడు కోట రాధాకృష్ణమూర్తి, జ్యోతిష్య నిపుణుడు బీవీబీ మురళీకృష్ణలను సత్కరించారు. ఈ సందర్భంగా కోట రాధాకృష్ణమూర్తిని 'ప్రవచన భానుడు' బిరుదుతో సన్మానించారు. అభినవ ఘంటసాల పాటూరి శ్రీనివాసులు సౌజన్యంతో ఉదయం పాటలు, నృత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రోత్సాహక నగదు బహుమతులు, జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా 100 మంది వర్తమాన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన అలరించాయి. కార్యక్రమంలో చెన్నై హాస్పటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఎండీ ఎస్వీ రమేష్‌బాబు, డ్యాన్స్ మాస్టర్ నాగిశెట్టి రమణయ్య, అందె శ్రీనివాసులు, నలుబోలు బలరామయ్యనాయుడు, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, కొప్పాల సుబ్రహ్మణ్యం, దూబిశెట్టి కల్యాణి, దాసరి ప్రసాద్, బల్లెం సుబ్బారావు, దంతం రవికుమార్, ఎం.శివకుమార్, బి.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.